క్లుప్తంగా

ఆహ్వాన పత్రిక అందజేత



జనగామ రూరల్/బచ్చన్నపేట: ఈనెల 26వ తేదీన శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వేడుకలకు హాజరు కావాలని ప్రభోదానంద యోగీశ్వరుల సేవాసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి జనగామలోని అయన నివాసంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. సెప్టెంబర్ 3వ తేదీ వరకు వేడుకలు కొనసాగుతాయని మంగళవారం పల్లకి సేవకు హాజరు కావాలని వారు ఎమ్మెల్యేను కోరారు. జిల్లా కమిటీ సభ్యులు ఉపేందర్, కె.ఉపేందర్, అశోక్ పాల్గొన్నారు.

నేడు బీఎల్‌ఓలకు శిక్షణ

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలకు నేడు (శనివారం) ఓటరు జాబితాపై శిక్షణ ఇవ్వనున్నట్లు నాయబ్ తహసీల్దార్ ఫణికిషోర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో చేర్పులు, మార్పులు, ఇంటింటా సర్వే తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉదయం 10:30 గంటలకు అన్ని గ్రామాల బీఎల్‌ఓలు హాజరు కావాలని అన్నారు.

నేడు గద్దర్ వర్ధంతి సభ

పాలకుర్తి టౌన్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభను పాలకుర్తిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఐక్య వేదిక నాయకుడు గుమ్మడిరాజుల సాంబయ్య మాట్లాడుతూ ప్రజా పోరాటాల్లో తన ఆటపాటల ద్వారా ప్రజలను గద్దర్ ఉత్తేజపరిచారని అన్నారు. గద్దర్ అంతిమ యాత్రలో హఠాన్మరణం పొందిన ఉర్దూ పత్రిక ఎడిటర్ జహీర్ అలీఖాన్ ప్రథమ వర్ధంతి సభను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం, మాజీ మావోయిస్టు జంపన్న, రాష్ట్ర అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, డాక్టర్ బైరి నరేష్, డాక్టర్ జీలకర్ర శ్రీనివాస్, సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్ రాజా హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సుమన్ నాయక్(ఫైల్)

తరిగొప్పుల : భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని జాలుబాయి తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై అయ్యాల శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. జాలుబాయి తండాకు చెందిన సుమన్(26)కు మూడు నెలల క్రితం పెళ్లయింది. కొద్దికాలం తర్వాత అతని భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ భార్య తనతో ఉండకపోవడంతో మనస్తాపం చెందిన సుమన్ శుక్రవారం తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్వేత తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..



రాజు(ఫైల్)

చిల్పూరు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కృష్ణాజీగూడెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుంచాల రాజు (32) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యతో విడాకులు కావడం, ఆర్థికఇబ్బందులతో మనస్థాపానికి గురై గురువారం క్రిమిసంహారక మందుతాగగా కుటుంబ సభ్యులు గమనించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు బక్కయ్య-అంజవ్వ కన్నీరుమున్నీరయ్యారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు అన్నపూర్ణ రైస్‌మిల్లు వద్ద ఈనెల 20వ తేదీన సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బైరపాక శోభ శుక్రవారం మృతి చెందింది. ఘన్‌పూర్ సీఐ జి.వేణు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం ధర్మపురానికి చెందిన బైరపాక సుదర్శన్, శోభ దంపతులు ఈనెల 20న ఘన్‌పూర్ నుంచి ధర్మపురానికి టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన డోలి రాజ్‌కుమార్ ఎఫ్‌జెడ్ బైక్‌పై వేగంగా వచ్చి అన్నపూర్ణ రైస్‌మిల్లు సమీపాన టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైరపాక సుదర్శన్, శోభ దంపతులకు తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై క్షతగాత్రుల కుమారుడు తరుణ్ ఫిర్యాదు మేరకు సీఐ వేణు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తీవ్రంగా గాయపడిన శోభ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది.

ప్రయాణం.. ప్రమాదకరం

● అండర్ బ్రిడ్జి కింద గుంతలతో ఇబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద ప్రయాణం ప్రమాదకరంగా మారగా వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలకు రైల్వే గేటు తిప్పలు తప్పించేలా నిర్మాణం చేసిన రైల్వే అండర్ బ్రిడ్జిలో రోడ్డు గుంతలమయంగా ప్రమాదకరంగా మారింది. అసలే ఇరుకురోడ్డు, దానిపై గుంతలు ఉండటంతో అనునిత్యం అండర్‌బ్రిడ్జి ప్రయాణంలో ప్రజలకు నరకం కనిపిస్తోంది. కనీసం బీటీ కూడా లేని గుంతలరోడ్డు, దానికి తోడు అండర్ బ్రిడ్జి వద్ద ఎలాంటి లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ అండర్‌బ్రిడ్జి నుంచి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అండర్ బ్రిడ్జి వద్ద పలుమార్లు వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దాంతో చేసేదేమి లేక వాహనదారులు గుంతలుగా ఉన్న ఇరుకురోడ్డు నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్తున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగాక చింతించే కన్నా ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి అండర్‌బ్రిడ్జి వద్ద రోడ్డు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొడకండ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతుల పక్షాన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరికీ రుణమాఫీ చేయడంతో పాటు హామీలన్నీ నెరవేర్చే దాకా బీఆర్‌ఎస్ రైతులు, ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. అనంతరం ఏఓ విజయ్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అభిమన్‌గాంధీనాయక్, వెంకటేశ్వర్‌రావు, సోమరాములు, జ్యోతి, విజయమ్మ, ఆసీఫ్, రాజిరెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై మెయిన్ లైన్ ఎత్తు పెంచాలి



ఎమ్మెల్యే శ్రీహరికి వినతి పత్రం అందజేస్తున్న రాంబాబు, భిక్షపతినాయక్

రఘునాథపల్లి: మండలంలోని మేకలగట్టు-గిద్దబండతండా గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జితో పైనున్న విద్యుత్ మెయిన్ లైన్ కిందకు రావడంతో ప్రమాదకరంగా మారిందని.. లైన్ ఎత్తు పెంచాలని మాజీ ఎంపీటీసీ బానోత్ భిక్షపతి స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు, స్థానికులతో కడియంను కలిసి విజ్ఞప్తి చేశారు. బ్రిడ్జి ఎత్తు పెరగడంతో విద్యుత్ మెయిన్ లైన్ కిందకు రావడంతో వాహనాల రాక పోకలకు ప్రమాదకరంగా మారిందని విన్నవించారు. వాహనాలు సాఫీగా వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలన్న తమ వినతికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని భిక్షపతినాయక్ తెలిపారు.

హర్షణీయం



పాలకుర్తి టౌన్: రాష్ట్రంలోని ఎరుకల సామాజిక వర్గాన్ని ఆర్థికంగా అభివృద్ధిచేసేందుకు ఏకలవ్య కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సాయిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరుకల హక్కుల కోసం చేసిన సుదీర్ఘ పోరాట ఫలితమే కార్పొరేషన్ ఏర్పాటు అని అన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవిని సమితి బాధ్యులకే అప్పగించాలని కోరారు. దేవసాని సురేష్, అంగడి ఎల్లయ్య, సోమయ్య, అశోక్, రాంచందర్, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బీమాతో మహిళలకు భరోసా



మాట్లాడుతున్న ఏపీఎం సారయ్య

రఘునాథపల్లి: మహిళలకు భరోసాగా ప్రభుత్వం రెండు రకాల ఉచిత బీమా సౌకర్యం కల్పించినట్లు ఏపీఎం సారయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కంచనపల్లి రైతు వేదికలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా కంచనపల్లి క్లస్టర్ పాడి పశువులు, పెరటికోళ్ల పెంపకంపై మహిళలకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఉచిత బీమాలో సంఘంలోని సభ్యురాలు ప్రమాదవశాత్తు మృతి చెందితే నామినీకి రూ.10 లక్షల బీమా, సంఘంలో బ్యాంక్, స్త్రీనిధిలో అప్పు తీసుకుని మరణిస్తే రూ.2 లక్షల బీమా వరిస్తుందన్నారు. రుణాలు పొందిన సభ్యులు సకాలంలో చెల్లించి సంఘాల అభివృధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ పాడి గేదల ఎంపిక, పోషణ, నిర్వహణపై మహిళలకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో సీసీ సూత్రపు సంపత్, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు లలిత, నిర్మల, విఓఏలు, మహిళా రైతులు పాల్గొన్నారు,

‘ఉనికి కోసం బీఆర్‌ఎస్ పాకులాట’



మాట్లాడుతున్న నాయకులు

కొడకండ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేయడంతో దిక్కుతోచని దుస్థితిలో బీఆర్‌ఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకొనేందు కోసం పాకులాడుతున్నారని పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్, మండల నాయకుడు కీసర సునీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్లలో ఇచ్చిన ఒక హామీని కూడా నేరవేర్చకుంటే ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా కూడా బీఆర్‌ఎస్ నాయకులకు బుద్ధి రాకపోవడం బాధాకరమని, దేశ చరిత్రలో ఎక్కడ లేనివిధంగా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నాయకులు వీర్యానాయక్, యాకూబ్‌నాయక్‌లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



బచ్చన్నపేట: గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి చుట్టూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం డ్రైడేను నిర్వహించారు. వీధుల్లో తిరిగి కుండలు, డమ్ముల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. కుండల్లోని నీటిని పారబోయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జీపీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

‘రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం’

జఫర్‌గఢ్: రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీలు, దరఖాస్తుల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మోసం చేస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన అనంతరం కొర్రీలు పెడుతూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఆంక్షాలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులందరిని సమీకరించి తహసీల్దార్ కార్యాలయను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. నాయకులు నక్క యాకయ్య, పిన్నింటి సమ్మయ్య, నీరటి కొంరయ్య, వేల్పుల పెద్ద రాములు, ఎర్ర రవి, శాగ యాదగిరి పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



వేడుకల్లో గిరిజనులు

దేవరుప్పుల : మండలంలోని నల్లకుంట తండా గ్రామంలో గిరిజన యువతులు తీజ్ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మోహన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేష్, భాస్కర్,వెంకన్న, మహేందర్ మల్లేష్, రవి, మంగ్యా, సాయి, సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటన పునరావృతం కావొద్దు



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దేవరుప్పుల: సభ్యసమాజం తలదించుకునేలా ప్రాణదాతపై కోల్‌కతాలో జరిగిన దుర్ఘటన భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్ కొలెపాక భాస్కర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ జనగామ-సూర్యాపేట రహదారిపై పలు నినాదాల ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.చైతన్య. పి.రాధిక, రహీమున్నీసా, హరితకుమారి, కదరి రవీందర్, రాపోలు శ్రీనివాస్, ఎస్ భవానీ, సుమ పాల్గొన్నారు.

అక్రమంగా సహజ వనరులు తరలిస్తే చర్యలు



పట్టుకున్న ట్రాక్టర్లతో పోలీసులు

దేవరుప్పుల: అసైన్డ్, ప్రభుత్వ భూములతోపాటు వాగుల్లో నుంచి సహజ వనరులైన మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు అనివార్యమని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో మైనింగ్, రెవిన్యూ సహా ప్రభుత్వ శాఖల అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత అనుమతుల మేరకు కాకుండా ఇష్టానుసారంగా సహజ వనరులను తరలించడంతో భవిష్యత్ ప్రయోజనాలకు విఘాతం కలుగడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న కామారెడ్డిగూడెంకు చెందిన సూదగాని శ్రీను, చింత వెంకటేశ్వర్లు, సందీప్, ఎల్లబోయిన రమేష్‌ల ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలకై తహసీల్దార్‌కు సిఫారసు చేసినట్టు వివరించారు.

గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొడకండ్ల: చేవేళ్ల సభా వేదికగా కాంగ్రెస్ గిరిజనులకు ప్రకటించిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోత్ రామకోటినాయక్ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో అమలు చేస్తామన్న గిరిజన డిక్లరేషన్‌ను విస్మరించడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు పరమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలకేంద్రాల నుంచి గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించి ఆర్టీసీ బస్సులు వేయాలని, నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలని, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని, గిరిజన తండా జీపీలను రెవెన్యూ గ్రామాలుగా ప్రకటించాలని, జిల్లాకు ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చంద్రమోహన్‌కు అందజేశారు. నాయకులు కోటేశ్వర్, ఉపేందర్, శ్రీనివాస్, అజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వైభవంగా బోనాలు



బచ్చన్నపేట: మండలంలోని ఆలింపూర్ గ్రామంలో గ్రామ దేవతలకు శుక్రవారం గ్రామస్తులు ఘనంగా బోనాలను చేశారు. మాతమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ దేవతకు మహిళలు బోనాలతో ఆలయాలకు తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఓటరు జాబితాల్లో సవరణలు



బచ్చన్నపేట: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటరు లిస్టులో సవరణలు చేయడం జరుగుతుందని తమ్మడపల్లి, కొడవటూర్ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సృజన, బృంగి రూపాచైతన్య అన్నారు. శుక్రవారం వారు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద మాట్లాడారు. ఓటరు లిస్టులో చేర్పులు, మార్పులు చేస్తున్నట్లు చెప్పారు.

మంద కృష్ణను కలిసిన ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్



కొడకండ్ల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి అభినందనలు తెలిపారు. 30 ఏళ్ల మంద కృష్ణ పోరాటం వల్లనే ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమమైందని, సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని ఈ సందర్భంగా యాకయ్య అన్నారు. నాయకులు గోవింద్, నరేష్, రవి, సోమయ్య, సుజాత ఉన్నారు.

రేపు శ్రీపతిపల్లికి కొండా దంపతుల రాక

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి ఈనెల 25వ తేదీన మంత్రి కొండా సురేఖమురళి దంపతులు రానున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని విష్ణుదుర్గామాతకు కొండా దంపతులు ఆదివారం బంగారు ఆభరణాలను సమర్పించి పూజలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పరామర్శ



నర్మెట: మండల కేంద్రంలో ఐదు రోజుల క్రితం మృతి చెందిన కందకట్ల లక్ష్మి కుటుంబ సభ్యులను పలువురు నాయకులు శుక్రవారం పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, వలబోజు శ్రీనివాస్, తీగుళ్ల భూపతి, ముక్కెర రాజేష్ యాప్, ఇూలయ్య ఉన్నారు.

వంగ సుదర్శన్‌రెడ్డినగర్ గ్రామంలో..



శాంతమ్మ(ఫైల్)

బచ్చన్నపేట: వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామంలో నక్కలపిట్టల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు కాలియా చిట్టిబాబు భార్య శాంతమ్మ(54) మృతి చెందింది. కాగా, పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, మాజీ సర్పంచ్‌లు మూసిని సునీత, కోనేటి స్వామి, శివరాత్రి కవిత, తేలుకంటి మురళి, బావండ్ల కృష్ణంరాజు, మూసిని రాజు, శివరాత్రి రాజనర్సు, వీరాగౌడ్, నరేష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూదే కీలక భూమిక



కార్యవర్గాన్ని సన్మానించిన మహిపాల్‌రెడ్డి

కొడకండ్ల: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పాలకులపై ఒత్తిడి తెచ్చి పరిష్కరించడంలో పీఆర్‌టీయూ కీలక భూమికను పోషిస్తుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కోల్ల మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల శాఖ అధ్యక్షుడు రామావజ్ఝల అనిల్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సంఘ పటిష్టతతో పాటు సభ్యుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పాత కార్యవర్గాన్ని సన్మానించారు. అనంతరం 2024-26 సంవత్సర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా గడ్డం చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా బేతోజు శ్రీనివాసచారి, అసోసియేట్ అధ్యక్షుడిగా పసునూరి ఉమేష్, కార్యదర్శులుగా వనజాత, మొయినుద్దీన్ ఎన్నికయ్యారు. పూర్వ మాజీ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలకుర్తి: రాష్ట్ర వ్యాప్తంగా కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పని చేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి రవి కోరారు. ఈ మేరకు కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం ఈనెల30న తలపెట్టిన చలో హైదరాబాద్ కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఎం.డి షరీఫ్, పద్మ, సుమలత, లక్ష్మి, లత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

జనగామ రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని పెద్దపహాడ్ స్టేజీ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్ గ్రామానికి చెందిన మంద మల్లారెడ్డి (65) తన స్కూటీపై బచ్చన్నపేటలో వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా పెద్దపహాడ్ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా బచ్చన్నపేట నుంచి జనగామ దిశగా వెనుక నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లారెడ్డితోపాటు అతడి స్కూటీపై ప్రయాణిస్తున్న బేజాడి రజితతోపాటు పశ్చిమ గోదావరి జిల్లా పత్తిపాడుకు చెందిన టాటా ఏసీ వాహన డ్రైవర్ బట్ట జోగయ్య తీవ్ర గాయాల పాలయ్యారు. ముగ్గురినీ ఆస్పత్రికి తరలించగా మల్లారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మల్లారెడ్డి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెన్నకేశవులు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్



పగలే వెలుగులు..

లింగాలఘణపురం మండలంలోని క్లాంలో వీధిలైట్లు పట్టపగలే వెలుగుతున్నా పట్టించుకొనేనాథులే కరువయ్యారు. ఒకవైపు పంచాయతీలకు నిధుల కొరతతో నిర్వహణ ఇబ్బందిగా ఉన్న తరుణంలో ఇలా 24 గంటలు వీధిలైట్లు వెలుగడంతో విద్యుత్ చార్జీల భారం పడుతున్నా పట్టించుకొనే అధికారులే కరువయ్యారు.

- లింగాలఘణపురం

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
సీతారాంనాయక్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 9177996299